నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 11 ఫిబ్రవరి 2025 | BHADRADRI KOTHAGUDEM

# బోనస్ బోగస్

## బోనస్‌దీ బోగస్ హామీనేనా?

- 'ఖమ్మం' కర్షకులను మళ్లీ మళ్లీ దగా చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- 'రూ.500 బోనస్' అంటూ హామీలు.. నేటికీ ఇవ్వని పాలకులు..
- ప్రభుత్వ వాగ్దానంతో అధిక విస్తీర్ణంలో సాగుచేసిన అన్నదాతలు
- అష్టకష్టాలూ పడి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయాలు
- 50 రోజులైనా అందని బోనస్.. రైతులకు తప్పని ఎదురుచూపులు..
- కొందరి ఖాతాల్లో వడ్ల నగదునూ జమ చేయని రేవంత్‌రెడ్డి సర్కారు
- మరికొందరు రైతులకు వడ్ల నగదు వేసి.. 'బోనస్'కు ఎగనామం!

బోనస్ పేరిట పెట్టిన ఒట్టు.. ఒట్టి బోగస్సేనని నిగ్గుతేలింది. కర్షకులందరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ధాన్యం విక్రయించి 50 రోజులు దాటినా వారికి ఇంకా బోనస్ నగదును జమ చేయకపోవడమే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తోంది. రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా వంటి పథకాలను ఇప్పటికీ పూర్తిస్థాయిలో అర్హులకు అందించని ప్రభుత్వం.. తాజాగా బోనస్ విషయంలోనూ అన్నదాతలను మోసం చేస్తోంది. తాము గెలిస్తే క్వింటా వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్.. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని తీసి పక్కన పెట్టింది. పైగా సవాలక్ష షరతులు పెట్టింది. కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామంటూ మెలికలు పెట్టింది. దీంతో చేసేదేమీ లేక రైతులందరూ అష్టకష్టాలూ పడి సన్నాలు పండించారు. భారమైనప్పటికీ తీసుకెళ్లి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ వస్తే.. తమ రెక్కల కష్టం పోయినా.. కనీసం పెట్టుబడి అయినా మిగులుతుందని ఎంతో ఆశపడ్డారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం వారి ఆశలపై ఎప్పటికప్పుడు నీళ్లు చల్లుతూ వస్తోంది. కేవలం ప్రభుత్వం ఇచ్చిన మాటను విశ్వసించిన కర్షకులు.. అధిక విస్తీర్ణంలో సన్నాలను పండించి సర్కారుకు విక్రయించారు. కానీ కర్షకులపై విశ్వాసాన్ని చూపని కాంగ్రెస్ సర్కారు మాత్రం.. బోనస్ నగదు చెల్లింపుల్లో కాలయాపన చేస్తోంది. రోజులకు రోజులు ఆలస్యం చేస్తుండడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. అయితే, ధాన్యం విక్రయించిన రైతుల్లో కొందరికి వడ్ల నగదును మాత్రమే జమ చేసిన ప్రభుత్వం.. మరికొందరికి దానిని కూడా అందించలేదు. చివరికి బోనస్ జమ విషయంలోనూ ఇదే విధానాన్ని అమలు చేస్తోంది. తక్కువ మొత్తంలో చెల్లించాల్సిన రైతులకు మాత్రమే బోనస్ జమ చేసి.. ఎక్కువ మొత్తంలో జమ చేయాల్సిన రైతులకు మాత్రం ఎగనామం పెడుతున్నట్లుగా కన్పిస్తోంది. దీంతో బోనస్ విషయంలో ఈ ప్రభుత్వం తమను దగా చేస్తోందంటూ అన్నదాతలు భగ్గున మండిపడుతున్నారు.

–ఖమ్మం, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)



### రెండు నెలలైనా డబ్బులు పడలేదు..



రైతులకు బోనస్ డబ్బులు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పి రెండు నెలలైనా ఇంతవరకు నాకు బోనస్ డబ్బులు పడలేదు. నేను పండించిన 63 క్వింటాళ్ల 20 కిలోల వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. వడ్లను విక్రయించి రెండు నెలలైనా ఇంతవరకు నా ఖాతాలో డబ్బులు జమ చేయలేదు. ఇలా నాతో పాటు చాలా మంది రైతుల ఖాతాల్లో డబ్బులు పడలేదు. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగడమే పని పెట్టుకుంటున్నారు.

–పందేటి వెంకయ్య, రైతు, దమ్మపేట

### 50 క్వింటాళ్లకు బోనస్ రావాలి..



నా భార్య గంగమ్మ పేరు మీద 50 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాం. వడ్ల డబ్బులు నా భార్య ఖాతాలో జమ అయ్యాయి. కానీ ప్రభుత్వం ఇస్తానన్న బోనస్ పడలేదు. క్వింటాకు రూ.500 చొప్పున 50 క్వాంటాళ్ల ధాన్యానికి బోనస్ రావాల్సి ఉంది. ప్రభుత్వం కొందరు రైతులకు బోనస్ వేస్తే.. మరికొందరు రైతులకు వేయడం లేదు. హామీ మేరకు బోనస్ ఇవ్వడం లేదు.

– బానోత్ రమేశ్, రైతు, సుద్దవాగుతండా, తిరుమలాయపాలెం

### నగదు ఎప్పుడు జమ అవుతుందో చెప్పడం లేదు..



మేం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ధాన్యం విక్రయించాం. క్వింటాకు రూ.500 చొప్పున ప్రభుత్వం నుంచి బోనస్ నగదు మా బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని అధికారులు చెప్పారు. కానీ ఇంకా బోనస్ డబ్బులు పడలేదు. ఎప్పుడు పడతాయని అధికారులను అడిగితే.. ఆన్‌లైన్ చేశామని సమాధానం చెబుతున్నారు. అందరికీ బోనస్ డబ్బులు వస్తాయని చెప్పారు. కానీ ఎప్పుడొస్తాయో చెప్పడం లేదు.

–తెల్లం నాగమ్మ, మహిళా రైతు, చిన్నరాయిగూడెం, మణుగూరు

### ప్రభుత్వానివి మాయమాటలు



37 క్వింటాళ ధాన్యం దిగుబడి రావడంతో కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తుందని చెప్పడంతో ఎంతో ఆశపడ్డా. ధాన్యం అమ్మి నెలలు గడుస్తున్నా ఇంతవరకు నా ఖాతాలో బోనస్ డబ్బులు జమ కాలేదు. ప్రభుత్వం మాయమాటలు చెప్పి రైతులను అనేక రకాలుగా మోసం చేస్తుంది. రైతులు ఈ ప్రభుత్వంపై నమ్మకాన్ని కోల్పోయారు. ఎవరి మాటలు నమ్మాలో అర్థం కావడం లేదు.

–మోటపోతుల వేణు, రైతు, వేంసూరు

### ఎవర్ని అడగాలో అర్థంకావట్లేదు..



కాంగ్రెస్ ప్రభుత్వంలో మాటలు తప్ప చేతలు లేవు. రైతులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామనే మాట కూడా అలాగే ఉంది. మొదట్లో ఇచ్చామని గొప్పలు చెప్పి పండుగలు చేశారు. కానీ ఇవ్వలేదు. 210 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించాను. బోనస్‌కు సంబంధించిన ఒక్క రూపాయి కూడా పడలేదు. ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు. ఈ ప్రభుత్వం రైతులను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నట్లుంది.

–వెలివెల కృష్ణయ్య, రైతు, పెనుబల్లి

### బోనస్ కోసమే సన్నధాన్యం వేశాం..



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లుగా బోనస్ వస్తుందనే ఆశతోనే వానకాలంలో సీజన్‌లో సన్నధాన్యం పండించాం. ఎన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ సన్న వడ్లు వేసేందుకే మొగ్గు చూపాం. క్వింటాకు రూ.500 బోనస్ వస్తుందని ఎంతో ఆశించాం. ఆ బోనస్ నగదు వస్తే పెట్టుబడి తీరుతుందని అనుకున్నాం. కానీ సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చినట్లుగా ఇప్పటి వరకు మా ఖాతాల్లో బోనస్ నగదు జమ కాలేదు.

–బట్ట నరసింహారావు, రైతు, కమలాపురం, మణుగూరు

### 45 రోజులుగా ఎదురుచూస్తున్నా..



మూడెకరాల్లో వరి పంట సాగు చేశాను. 67 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సన్నాలకు బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెప్పడంతో కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించాను. వారం రోజుల్లో బోనస్ వస్తుందని చెప్పినా ఇప్పటివరకు బోనస్ పడలేదు. 45 రోజుల పైబడి ఎదురు చూస్తున్నా. అసలు బోనస్ డబ్బులు వస్తాయో... రావో అర్థం కావడం లేదు. అధికారులను అడిగితే వస్తాయిలే అని చెబుతున్నారు. వెంటనే బోనస్ డబ్బులు వచ్చేలా చూడాలి.

–మిరియాల కోటేశ్వరరావు, రైతు, అన్నపురెడ్డిపల్లి

### నెలలు దాటినా బోనస్ పడదా?



ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వడ్లు తరలించి నెలలు దాటినప్పటికీ ఇంతవరకు బోనస్ డబ్బులు పడలేదు. మాకు డబ్బులు పడ్డాయి అని చెప్పే రైతులే లేరు. అదిగో ఇదిగో అని మాటలు చెప్పడమే తప్ప ఇంతవరకు డబ్బులు పడిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులకు ఏమాత్రం నమ్మకం లేదు. రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదు.

–కాకా ప్రసాద్, రైతు, తాళ్లపెంట

# త్వరితగతిన అర్జీలు పరిష్కరించాలి

ప్రజావాణిలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 10: ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఆర్వో పద్మజ, డీఆర్‌డీవో సన్యాసయ్యలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, అనుమతి లేకుండా గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు ఉదయం వచ్చి అందుబాటులో ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. నగరంలోని పాకబండ బజార్‌కు చెందిన జి.ఝాన్సీ, నగరానికి చెందిన దివ్యాంగుడు వినయ్‌కుమార్, పుట్టకోటకు చెందిన సర్వమ్మ తదితరులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ప్రజావాణిలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు. అలాగే వికలాంగుల హక్కుల పోరాట సమితి వినతిపత్రం అందించి.. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఆటో స్టాండ్ ఒకే సంఘానికి కాకుండా వివిధ సంఘాలకు లేదా టెండర్ రూపంలో ఇచ్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని రద్దీ ప్రాంతాల్లో స్త్రీ టీ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని, పేద దివ్యాంగ మహిళలకు వాటిని కేటాయిస్తామని, ఆ వివరాలు అందించాలని సూచించారు. పురుషులకు ఇతర పథకాల ద్వారా బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు.

# అర్హులైన గిరిజనులకు పథకాలు

గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో రాహుల్



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, ఫిబ్రవరి 10: అర్హులైన ప్రతీ గిరిజన కుటుంబానికి ఐటీడీఏ ద్వారా ప్రభుత్వ పథకాలు అందిస్తామని, వాటిని సద్వినియోగం చేసుకొని గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆదివాసీ గిరిజనుల నుంచి పీవో అర్జీలు స్వీకరించారు. తన పరిధిలోని వాటిని పరిష్కరించి, మిగిలిన వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన కుటుంబాలకు జీవనోపాధి పెంపొందించేందుకు యూనిట్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాలకు రుణాలు, పట్టా భూములకు రైతుబంధు, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం వంటి అంశాలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఏవో సున్నం రాంబాబు, డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ఎస్‌వో ఉదయ్‌భాస్కర్, ఏపీవో పవర్ వేణు, ఆర్‌వోఎఫ్‌ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, ఉద్యాన అధికారి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఐటీడీఏలో రేపు జాబ్‌మేళా

ఐటీడీఏలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలో గల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పీవో రాహుల్ తెలిపారు. 12న ఉదయం 9 గంటలకు అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతోపాటు ఆధార్, కుల ధ్రువీకరణ జిరాక్స్‌లతో హాజరుకావాలని సూచించారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో ఇన్ ఫార్మసీ, డిప్లొమో, పీజీ, బీటెక్ తదితర విద్యార్హతలు కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8179925586, 6302608095 నంబర్లలో సంప్రదించాలని పీవో కోరారు.

# కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా

పది రోజులుగా చేపట్టిన దీక్షను విరమింపజేసిన డీపీవో



భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట వద్ద ధర్నా చేస్తున్న లక్ష్మీదేవిపల్లి పంచాయతీ కార్మికులు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 10 (నమస్తే తెలంగాణ) : తమ అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి లక్ష్మీదేవిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ వర్కర్స్, సిబ్బంది అఖిలపక్షం నాయకుల మద్దతుతో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పది రోజులుగా దీక్షలు చేపట్టిన కార్మికులు ఆందోళనకు దిగడంతో విషయం తెలుసుకున్న డీపీవో చంద్రమౌళి అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. మేజర్ పంచాయతీ కార్మికుల వేతనాలు పాత పద్ధతి ప్రకారం ఇవ్వడం కోసం కార్మికులు ఇచ్చిన లేఖపై కలెక్టర్ సంతకంతో కమిషనరేట్‌కు పంపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కార్మికులు ఆందోళనతోపాటు దీక్షలు విరమిస్తున్నట్లు ప్రకటించారు. పది రోజులుగా దీక్షలకు మద్దతు పలికిన అఖిలపక్షం నాయకులకు కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్మికులు, అఖిలపక్షం నాయకులు అన్వర్ పాషా, నవతన్, వినోద్, రమేశ్, లగడపాటి, వాసం రామకృష్ణ, గాంధీ పాల్గొన్నారు.

# ఖమ్మం మార్కెట్ @ లక్ష బస్తాలు

- రికార్డుస్థాయిలో పోటెత్తిన ఎర్రబంగారం
- జెండాపాటలో క్వింటాకు రూ.14 వేలు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చిబస్తాలు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 10: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం రైతులు సుమారు లక్ష మిర్చి బస్తాలను తీసుకొచ్చారు. రెండ్రోజుల సెలవుల అనంతరం క్రయవిక్రయాలు ప్రారంభం కావడంతో మిర్చిబస్తాలతో మార్కెట్ యార్డు పోటెత్తింది. ఖమ్మం జిల్లా నుంచేకాక పొరుగు జిల్లాల నుంచి సైతం రైతులు ఊహించని విధంగా పంటను తెచ్చారు. గత వారం ఒకేరోజు సుమారు 75 వేల బస్తాలు రాగా సోమవారం ఏకంగా లక్ష బస్తాలు వచ్చాయి. జెండాపాటలో ఖరీదుదారులు క్వింటా మిర్చి ధరను రూ.14 వేలుగా నిర్ణయించారు. అయితే అంతకుముందుగా రూ.13,600గా నిర్ణయించడంతో రైతులు, కొంతమంది అడ్తీదారులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో చివరకు రూ.14 వేలుగా ఫైనల్ చేశారు. వందలాది మంది రైతులు పంటను తీసుకొచ్చినప్పటికీ కేవలం ఒక్కరిద్దరికి మాత్రమే జెండాపాట ధర పలకడం గమనార్హం. మిగిలిన రైతుల పంటకు అత్యధిక ధర క్వింటాకు రూ.12,500 నుంచి రూ.13,500 పలికింది. క్రయవిక్రయాలకు యార్డు సరిపోకపోవడంతో వాహనాలు బయటనే నిలిచిపోయాయి. తాలురకం ధర మరింత క్షీణించింది. అడిగే నాథుడు లేకపోవడంతో వ్యాపారులు ఇష్టారీతిన తాలు రకానికి ధర నిర్ణయించి కొనుగోలు చేశారు.

### దళారుల హవా...

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ మిర్చియార్డులో దళారుల హవా కొనసాగుతున్నది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దడవాయిలు లేకుండానే కొందరు వ్యాపారులు కాంటాలు వేసుకుంటున్నారు. యార్డులో అక్కడే కొనుగోలు చేసి కాసేపటి తర్వాత తిరిగి అసలు ఖరీదుదారులకు అక్కడే పంటను అమ్ముతున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే చిల్లర వ్యాపారులమని చెప్పుకోవడం కొసమెరుపు. ప్రస్తుతం మిర్చి మార్కెట్‌లో ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా 40 నుంచి 50 మంది వ్యక్తులు ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా యార్డులో రైతుల వద్ద పంటను కొనుగోలు చేస్తున్నారు. అన్నదాతల అవసరాలను ఆసరాగా తీసుకొని అక్కడే పంటను కొనుగోలు చేసి వెంటనే బస్తాలను ప్రత్యేకంగా వారికి కేటాయించిన షెడ్‌లలో డంప్ చేసి తిరిగి అసలు వ్యాపారులకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తున్నది. దీంతో నిత్యం 10 వేల బస్తాల లెక్కలు రికార్డులో నమోదు కాకుండా కాంటాలు వేసుకుంటున్నారు. పైగా అలా వేసుకున్న బస్తాలకు హమాలి, రెల్లుడు, దడవాయిల చార్జీల పేరుతో ఒక్కో బస్తాకు రూ.22 వరకు రైతుల వద్ద కట్ చేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా అప్పుడప్పుడు మార్కెట్ అధికారులు నామమాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది.

# సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తాం..

మధిర డిపో ఎదుట గేట్ మీటింగ్‌లో జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణకుమారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి రామచంద్రరావు



ఆర్టీసీ డిపో ఎదుట నినాదాలు చేస్తున్న జేఏసీ నాయకులు

మధిర, ఫిబ్రవరి 10: సమస్యల పరిష్కారం కోసం గత నెల 27న రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు ఇచ్చామని, అయినప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని, దీనిపై సమ్మె చేయడానికి కూడా వెనుకాడబోమని జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.అరుణకుమారి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.రామచంద్రరావు హెచ్చరించారు. టీజీ ఆర్టీసీ జేఏసీ పిలుపు మేరకు మధిర డిపో జేఏసీ చైర్మన్ షేక్ నాగుల్‌మీరా ఆధ్వర్యంలో సోమవారం డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించి నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, 2021 వేతన సవరణ వెంటనే అమలు చేసి వాటి ఎరియర్స్‌తో పాటు 2017 వేతన సవరణకు సంబంధించిన అలవెన్స్‌ను పెంచి ఎరియర్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త బస్సులను కొనుగోలు చేసి అన్ని రకాల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సీసీఎస్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎం.రామారావు, కే.కిశోర్ బాబు, బీ.మురళీకృష్ణ, వీ.రామకృష్ణ, వివిధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# నేషనల్ హైవేపై సైలో బంకర్ బాధితుల రాస్తారోకో

- సైలో బంకర్‌ను తొలగిస్తారా.. మమ్మల్నే పొమ్మంటారా..?
- బొగ్గు నుంచి వచ్చే దుమ్మూధూళితో ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..
- దానిని తక్షణమే మార్చకపోతే ఈ నెల 25వ తేదీ నుంచి ఆమరణ దీక్షలు చేస్తాం..



తల్లాడ – దేవరపల్లి నేషనల్ హైవేపై రాస్తారోకో చేస్తున్న అంబేద్కర్‌కాలనీ వాసులు

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 10: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారంలోని సింగరేణి బొగ్గు తరలింపునకు సంబంధించి నిర్మించిన సైలో బంకర్‌ను తొలగిస్తారా.. లేదంటే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు ఇచ్చి పంపించి వేస్తారా.. అంటూ కిష్టారంలోని అంబేద్కర్ నగర్ సైలో బంకర్ బాధితులు తల్లాడ–దేవరపల్లి నేషనల్ హైవేపై సోమవారం రాస్తారోకో చేపట్టారు. సుమారు 150 కుటుంబాలు ఉన్న కాలనీవాసులు ప్లకార్డులు చేబూని ప్రధాన రహదారిపై బైఠాయించారు. అనంతరం సైలో బంకర్ పక్కనే రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సైలో బంకర్ ప్రారంభమైన నాటి నుంచి కాలనీ మొత్తాన్ని దుమ్మూధూళితో బూడిదమయం చేశారని, 10 నిమిషాలపాటు బయట కుర్చుంటే ఒంటిమీద బట్టలు కూడా నల్లబడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని ప్రభావంతో ఇప్పటికే 10 మందికి పైగా మృతిచెందారని, వందలాది మంది శ్వాసకోశ వ్యాధులతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇప్పటికే మా భూములు సింగరేణికి ఇచ్చి ఎంతో కోల్పోయామని వాపోయారు. ఇక్కడి ఓసీ ప్రాజెక్టు అధికారి హేళనగా చూడటమేకాక దుమ్మూధూళి ఎక్కడ వస్తుందని మాట్లాడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి సైలో బంకర్‌ను తీసెయ్యాలని, లేదంటే మాకు మరోచోట పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. కనీసం గ్రామ పంచాయతీ, పొల్యూషన్ బోర్డు అధికారుల అనుమతి తీసుకోకుండానే బంకర్‌ను ఏర్పాటు చేశారని ఆరోపించారు.

### 25 నుంచి ఆమరణ దీక్షలు చేస్తాం..

సమస్య పరిష్కారం కానిపక్షంలో ఈ నెల 25వ తేదీ నుంచి ఆమరణ దీక్షలతోపాటు పోరాటాన్ని ఉధృతం చేస్తామని దీక్షా శిబిరం నుంచి అంబేద్కర్ నగర్ ప్రజలు సింగరేణి అధికారులను హెచ్చరించారు. ఈ క్రమంలో దీక్షా శిబిరం వద్దకు కిష్టారం సింగరేణి పీవో నరసింహారావు వచ్చి ఎలాంటి ఆవేశానికి గురికావొద్దని, వీలైనంత త్వరగా సమస్య పరిష్కారమయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పారు. అయినా ససేమిరా అంటూ ఆందోళన దీక్షలు కొనసాగించారు. కార్యక్రమంలో కాలనీవాసులు మారోజు నాగేశ్వరరావు, కదారి మదీన, పాలకుర్తి నాగేశ్వరరావు, పాలకుర్తి ప్రభుదాస్, వాడపల్లి కోటేశ్వరరావు, కొండా నాగరత్నం, పాలకుర్తి సునీతారాజు, రామాల నాగమణి, రాణి పాల్గొన్నారు.